# ఫోర్త్ డైమెన్షన్ 8

రాజా కాస్సేపు సిగరెట్టు ధూపం సహాయంతో దీర్ఘంగా ఆలోచించి, 'మన సాహిత్యం అంతా బాగానే ఉందిగాని, దానిమీద ఐన్‌స్టయిన్ ప్రభావం ఇంకా పడ్డట్టు కనిపించదు.' అన్నాడు.

'అంటే?' అన్నాను.

అప్పటిదాకా మేం ఆధునిక సాహిత్యం గురించి అనేక విషయాలు మాటాడుకున్నాం. నాకూ, రాజేశ్వరరావుకూ ఏనాడూ అభిప్రాయాలు కలవ్వు. అందుకే నేమో చర్చలు యిద్దరికీ ఉపయోగకరంగా ఉంటాయి. 'అందరూ కంకరైనచోట రోడ్డుండదు' అంటాడు రాజా. 'ఆ విషయంలో నేను నీతో కంకరే,' అంటాను నేను.

మా అభిప్రాయభేదాలు వివరించటానికిది చోటుకాదనుకోండి.

'కథానికలు రాయటానికి పదేళ్ళ లైసెన్సులు జారీ చెయ్యాలి. ముసిలాళ్ళు కథానికలు రాయగూడదు. కథానిక యువకుల సొత్తు. కథానికలో వేడీ, ఘాటూ, పదునూ వగైరాలుండాలి. అంచేత ప్రతి కథకుడూ తన పదేళ్ళ లైసెన్సుకు కాలదోషం పట్టగానే నవలలో ఏవో రాసుకోవాలి. ఆడవాళ్ళకీవిషయంలో హెచ్చుసెన్సున్నది. వాళ్ళు రెండు మూడేళ్ళు కథలురాశాక, నవలలు ప్రారంభం చేస్తారు, మగాళ్ళు మరీ జిడ్డు,' అన్నాడు రాజా.

నేను సహజంగా ఒప్పుకోలేదు. కథానికలు ఎవరైనా రాయొచ్చు నన్నాను. అది అసలు సాహిత్యమే కాదన్నాను. వంట పదినిమిషాలు ఆలస్యమైతేనో, రైలు రావటానికింకా పావుగంట ఉందన్నప్పుడో కాలక్షేపానికి చదివేది కథానిక అన్నాను. ఏ యుగం

లోనూ ఏ కథానికా ప్రపంచాన్ని తల్లకిందులు చేసినట్టు దాఖలా లేదన్నాను.

తరవాత మనుషులు కథానికలు ఎందుకు రాస్తారు, కథానికా రచనకు ప్రేరేపకాలేమిటి, ఏ యే ప్రభావాలు కథానికలలో ప్రతిబింబితాలవుతాయి ఇత్యాది విషయాలను గురించి నేనూ, రాజా మా అభిప్రాయ భేదాలను ఒకరికొకరు తెలుపుకుంటున్నాం. ఇందులోకి ఐన్‌స్టయిన్ ఎందుకు వచ్చాడో నా కర్థంకాలేదు.

'మధ్యలో ఐన్‌స్టయిన్ ప్రభావం దేనికి?' అన్నాను.

'థియరీ ఆఫ్ రిలెటివిటీ-సాపేక్ష సిద్ధాంతం, ఫోర్త్ డైమెన్షన్ మన కథలలో కనబడవు' అన్నాడు రాజా, అందుకే కథానికా సాహిత్యం పతనమైపోతున్నట్లు.

'ఫోర్త్ డైమెన్షనంటే కాలమనేనా నీ ఉద్దేశం? మన కథల్లో కాలం లేదంటావా ఏమిటి? ఇంకా నయం!' అన్నాను.

'ప్రీస్‌ట్లీ రాసిన టైమ్‌ప్లేస్ (Time Plays) చదివావా? చదవలేదు, మరి మాట్లాడకు' అన్నాడు రాజా.

ఇట్లా అనటం వాడి నోరు ముయ్యటం ఇద్దరికీ పరిపాటే. కొన్ని కొన్ని విషయాలు వివరించటం మనకు అసాధ్యమైనప్పుడు ఉదాహరణ చెప్పి అవతలివాడి నోరు ముయ్యటం తేలిక. 'నీకు షేక్‌స్పియర్ సానెట్స్ నిజంగా అర్థమయాయా? లేదు, ఇక పీక దబాయించకు' 'రాఘవ పాండవీయం చదివావా? చదవలేదు! మరి నోరెత్తకు' ఇలాంటి బుకాయింపులు మా కిద్దరికీ అలవాటే.

'నన్ను ప్రీస్‌ట్లీపేరు చెప్పి భయపెట్టకు. కాలం అనేది లేని కథ ఏదోచెప్పు' అని రాజాని నిలవేశాను.

'నువ్వు చెప్పేది సింపుల్ టైమ్. కాని నేను చెప్పేది కాలం కూడా కథలో పాత్ర కావాలని' అన్నాడు రాజా.

'నా కర్థమయింది. అదేదో సినిమాలో చూపించారులే. హీరో చావుబతుకుల్లో ఉంటాడు. డాక్టరు వచ్చిచూసి అరగంటలో ఫలానా ఇంజెక్షన్ ఇవ్వకపోతే బతకడని చెబుతాడు! ఆ ఇంజెక్షను

తేవాలంటే ఒక కొండా, ఒకనదీ దాటి రైలుమీదా, కారుమీదా, గుర్రాలమీదా వెళ్ళాలి. హీరో స్నేహితుడు తీరా అంతదూరమూ వెళ్ళేసరికి షాపువాడు షాపుకు తాళంవేసేసి వెళ్ళిపోబోతూ రేపు రమ్మంటాడు. కథా నాయకుడి స్నేహితుడు ఏడుస్తూ పరిస్థితి చెబుతాడు. షాపువాడుకూడా ఏడ్చి దుకాణం తెరచి మందిచ్చి నూరు రూపాయల నోటు తీసుకుంటాడు. కథా నాయకుని స్నేహితుడు కారెక్కి వస్తుండగా దారిలో పెట్రోలు అయిపోవటమో ఏదో జరుగుతుంది. అంతదాకా నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద వందకార్లు పరిగెత్తుతాయి. కాని, హీరో స్నేహితుడు ఎంతగా చేతులు ఊపినా ఒక్క రాస్కెల్ కూడా కారు ఆపడు. ఇట్లా పదినిమిషాలు అయిపోయాక ఎవరో మంచివాడు మంచి కారును ఆపి, మనవాణ్ణి ఎక్కించుకుంటాడు. ఈలోపల ఆస్పత్రిలో గడియారం రంయిమని తిరిగిపోతూ ఉంటుంది. డాక్టర్ హీరో నాడిచూసి లాభం లేదన్నట్టు తల ఆడిస్తూంటాడు. ఇంతలో అరగంటా అయే పోతుంది. హీరోయిన్ కెవ్వున అరిచి మూర్ఛపోతుంది. ఇంతలో రొప్పుతూ రోజుతూ హీరో స్నేహితుడు వచ్చి డాక్టరుకు ఇంజెక్షనిస్తాడు. డాక్టరు విచారంగా గడియారంకేసి చూపించి చప్పరిస్తాడు. కథా నాయకుడి మిత్రుడు తన గడియారం చూపించి, అరగంట పూర్తి కావటానికింకా అరనిమిషం ఉన్నదంటాడు. డాక్టరుకు పోతున్న ప్రాణం కాస్తా తిరిగి వస్తుంది, ఇంజెక్ష నిచ్చేస్తాడు, హీరో లేచి కూచుంటాడు. హీరోయిన్ కూడా లేచికూచుని ఆనంద బాష్పాలు రాలుస్తుంది—'

'షటప్! షటప్!' అని రాజా పెద్దగా అరిచాడు. మంచి క్రైమ్ కథ చెప్పాను. వాడికి నచ్చలేదు. నేనేం చెయ్యను!

రాజా కొంచెంసేపు ఆలోచించి, 'నేనెప్పుడో ఒక నవల చదివాను. అందులో పదహారో శతాబ్దివాడొకడు ఇరవయ్యో శతాబ్దిలో ఉండిన ఒక పిల్లను ప్రేమిస్తాడు. వాడా ప్రేమతోనే జీవిస్తాడు. 'టుది వుమన్ ఐ నెవర్ మెట్!' అని టోస్ట్ చేస్తూంటాడు. అదో రకం క్రైమ్ కథ,' అన్నాడు.

'అటువంటి కథ నీ మొహంలా ఉంటుంది.' అన్నాను. వాడన్నది కాదనక ఎట్లాగూ తప్పదు. పైగా ఈ మాటలనటంలో ఆత్మద్రోహం ఏమీ లేదుకూడాను.

'ప్రతి వాడికీ ఆదర్శ ప్రేయసి కాదగిన మనిషి ప్రపంచంలో ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట ఉండనే వచ్చు. ఆ ఇద్దరికీ మధ్య నాలుగొందల ఏళ్ళ తేడాయే కాదు. నాలుగొందల మైళ్ళ తేడా ఉన్నాకూడా అది ట్రాజెడీయే. నీకు ఆదర్శ ప్రియురాలు కాదగిన మనిషి నాలుగిళ్ళ అవతలే ఉండి కూడా నీకు అందకపోవచ్చు. అదీ ట్రాజెడీయే' అన్నాను.

నా మాటలు రాజా వినిపించుకున్నట్టు లేదు. వాడింకేదో ఆలోచిస్తూ చాలాసేపు వుండిపోయి చివరకు 'ఫోర్త్ డైమెన్షన్ అంటే కాలం. చాలా పవిత్రమైనది. ఒక క్షణం క్రితం యాభై మైళ్ళ వేగంతో కారు వెళ్ళిపోయిన దారిలోకి మనం అడుగుపెడితే మన కే ప్రమాదం ఉండదు. ఆ క్షణం మనని కాపాడుతుంది.' అన్నాడు.

'రబ్బిష్! మనని మనమే కాపాడుకుంటాం? కారు వెళ్ళాకనే మనం దాని దారిలోకి అడుగు పెడతాం.' అన్నాను.

రాజా ఎందుకో నవ్వాడు.

'అందరికీ అంత శక్తి ఉండదు తమ్ముడూ, కొందరు కాలానికి బలి అయిపోవటం మనం రోజూ పత్రికల్లో చూడటంలేదా!' అన్నాడు.

'అవును, అదికూడా సినిమాల్లో చూస్తూనే ఉన్నామే. కథా నాయిక ఉప కథానాయకుడితో ఏదో మాట్లాడుతూ ఉంటుంది. కథా నాయకుడు కాలం కలిసిరాక అటుగావచ్చి తన ప్రేయసి, లేక భార్య అనేమాటలలో రెండేరెండు వింటాడు. తన ప్రేయసి, లేక భార్య కులట అనుకుంటాడు. మరి రెండు మాటలు వింటే ఈ అపార్థానికి అవకాశం ఉండదు. కాని కాలం, డైరెక్టరు రూపంలో తటస్థపడి, ఆ పై రెండు మాటలూ విననీకుండా అక్కణ్ణుంచి పంపేస్తుంది. ఏమిటి ఫలితం? చిత్రం మరో పన్నెండురీళ్లు నడుస్తుంది' అన్నాను.

'షటప్! షటప్!' అని మళ్ళీ పాత ఇన్సర్ట్ చేశాడు రాజా.

అదే మామధ్యఉన్న గమ్మత్తు. ఒకరు చెప్పినది ఒకరం ఆమోదించలేం సరేకదా ; ఒకరుచెప్పినది రెండోవాడు బలపరచ టానికి యత్నించినా ఒప్పుకోం.

'టైమ్‌లాగ్ !' అన్నాడు రాజా.

'టైమ్ లాప్స్ అంటారు. ఒక టైప్‌గాని, డిసాల్వ్‌కాని వేసి చూపించవచ్చు' అన్నాను. ఇంకా సినిమాలను గురించే ఆలోచిస్తూ.

'నీ సినిమా గొడవ మానేస్తావా లేదా? నేను నీ కో చిన్న టైమ్‌లాగ్ రొమాన్సు చెప్పబోతున్నాను.' అన్నాడు రాజా.

'తప్పకుండా చెప్పు కాని మాటల సందర్భంలో టైమ్‌లాగ్ రొమాన్సంటే ఏమిటో నాకు కాస్త అర్థమయేటట్లు చెయ్యి. ఆమాటే నాకు అయోమయంగా ఉంది. టైమ్‌లాప్స్ రొమాన్సయితే; సెన్సారు వాళ్లకు దొరక్కుండా!' అన్నాను.

రాజా నాకేసి తీక్షణంగా చూశాడు. చేసేదిలేక నేను తగ్గి పోయాను.

'నా జీవితంలో రొమాన్సు లేదని మీ అందరి అభిప్రాయ మూనూ. అవునా?' అన్నాడు రాజా.

'అబ్బే! ఛీ ఛీ!' అన్నాను మర్యాదకు. రెండో ఆటకు హాలు సగం ఖాళీగా ఉండే పిక్చరులాంటి తన జీవితంలోకూడ ఒక రొమాన్సు ఉన్నట్టు రాజా నన్ను నమ్మించ బోతున్నాడని నాకు అను మానం తగిలింది. పోనీ చెప్పనీ, పత్రికల్లో ఎన్ని అబద్ధపు రొమాన్సు కథలు చదువుతున్నాం కాదు? పాపం, రాజా నలభయ్యో పడిలో పడ్డాడు. ఇంకా వాడి జీవితానికి భవిష్యత్తులో రొమాన్సుందేమాట కల్ల. అంచేత వెనక్కి తిరిగి చూచుకుని ఏదో డిస్కవరీ చెయ్యాలి. అందువల్ల వాడికి తృప్తి కలిగేటట్టయితే నేనెందుకు కాదనాలి. నేనెట్లాగూ వాడుచెప్పేది నమ్మబోవటం లేదు. కాని ఆ సంగతి పైకి తెలియనివ్వను.

'నీకు ఇందిర తెలుసా?' అన్నాడు రాజా.

'ఏ ఇందిర?' అన్నాను.

'తొంభైమంది ఇందిర లున్నట్టు అడుగుతావేం? తెలీకపోతే తెలీదని చెప్పు, నా కీ నటనలు పనికిరావు.' అన్నాడు రాజా.

తాను కల్పనలు చెయ్యబోతూ నన్ను ఇంతమాట అనటం నాకేమీ బాగాలేదు.

'ఇందిరంటే మా అమ్మకు మేనమామ మనమరాలు. మా అమ్మకు ఇద్దరు మేనమామలు. వాళ్ళిద్దరికీ నలుగురు కూతుళ్లు. ఆ నలుగురు కూతుళ్లకూ మళ్ళీ ఆరుగురు కూతుళ్లు. వాళ్లలో ఇందిర ఒకతె. నాకన్నా మూడేళ్ళో ఏమో పెద్దది. నా అయిదో ఏట అను కొంటాను. మేము రెండుమూడు నెల్లపాటు దోస్తీగా తిరిగాం. ఇందిర తండ్రిది మావూరుకాదు గానీ, మావూళ్ళో పని సంపాదించి, నాలుగొందల గజాల స్థలం సంపాదించి ఇల్లుకూడా కట్టుకున్నాడు. ఆ ఇల్లు కట్టటం నాకు జ్ఞాపకం. అప్పటికి నాకు రెండో ఏడట. అంత చిన్న వయస్సులో జరిగినది నాకు జ్ఞాపకం ఉన్నదంటే ఎవరూ నమ్మలేరనుకో.

'నా అయిదో ఏట ఇందిర తాత చచ్చిపోయాడు. చాలా చెడ్డ నక్షత్రం. నా నలభై రెండేళ్ల జీవితంలో మంచి నక్షత్రాన ఎవరుగాని చావగా నేను విననేలేదు. సరే, ఇందిరా వాళ్లు రెండున్నర మాసాలు ఇల్లు పాడుబెట్టి మా ఇంటికి వచ్చి వున్నారు.

'నాకు ముందూ వెనకా ఎవరూ లేరుగా. ఒంటరిబతుకు! అలాంటప్పుడు ఇందిర సావాసం దొరకటం నాకు చెప్పరాని సంతోష మయిందనుకో.

'నాలాగే ఇందిరక్కూడా ఎవరూ లేరనుకుంటాను. దాని తమ్ముడు ఏడెనిమిది నెలల పసిగుడ్డు. వాడే తాత గండాన పుట్టా డన్నారు.

'ఇందిర నాకన్నా మూడేళ్లు పెద్దదైనా ఆ వయసులో నా ప్రాణానికి అడభీష్ముడిలాగా పెద్ద దిక్కల్లే ఉండేది. అంటే ఇందిర నాకు తోడేగాక రక్షణకూడాను. ఇందిర రాకముందు నేను మా అమ్మకు చూపుమేరలో ఉంటూ ఉండవలిసొచ్చేది. ఇందిర వచ్చాక నా మెడకు కాస్త పొడుగైన పలుపుతాడు తగిలించినట్టయింది. 'కాస్త వాణ్ణి చూస్తూండవే, ఇందిరమ్మతల్లీ!' అని హెచ్చరించాక అమ్మక్కూడా పెద్ద బరువు దిగిపోయినట్టుండే దనుకుంటాను.

'ఇంతేకాదు, ఇందిర నాకు సౌందర్యాన్వేషణ నేర్పింది. మా ఇంటి చుట్టూ ఉండే ఆవరణలో పెరిగిన రకరకాల పిచ్చిమొక్కలలో కొన్నిటి ఆకులు ముగ్గేసినట్టు ఎంత చక్కగా ఉన్నాయో. కొన్ని పిచ్చిమొక్కల పూలు కోసి అరిచేతిలో పెట్టుకుచూస్తే ఎంత చిత్రంగా కనిపిస్తాయో చూసింది. ఆరుద్ర పురుగుల్ని నేనెప్పుడూ చూడ లేదంటే, వాటికోసం నన్నేసుకుని తెగ వెతికింది. ఒక దానిమీద ఒకటి ఎక్కి ప్రయాణంచేసే గాజుపురుగుల్ని చూపించింది.

'ఆ రెండున్నర మాసాలూ నాకు ప్రపంచమంతా వింతల మయంగానూ, వినోదాల మయంగానూ గడిచింది.

'ఆ తరువాత ఇందిరావాళ్లు వాళ్ళ ఇంటికి పుణ్యాహవాచనం చేయించుకుని వెళ్లిపోయారు! నాజీవితం ఒక్క సారిగా బోసి పోయింది, మాదొడ్లో నాకు ఒక్క ఆకర్షణా కనబడలేదు, పైపెచ్చు ఇదివరకుకన్న చాలా నీరసంగా కనిపించింది.

'నేను పొందిన ఆనందానికి కారణం ఇందిరేనని నేను ఆ వయ సులోనే గ్రహించాను. దాన్ని ఎవరన్నా ప్రేమ అంటారో లేదో నాకుతెలీదు. నేను మట్టుకు ప్రేమనే అంటాను. ఎందుకంటే అది చిన్ననాటి మమకారాలల్లే క్రమంగా అంతరించిపోలేదు. కాలం దాన్ని చెరిపెయ్యలేదు- కాని అంతకన్న పెద్దదుర్మార్గమే చేసింది.

'తరవాత మూడేళ్లకు కాబోలు ఇందిరకు పెళ్లి అయింది. ఇందిరను కల్యాణం బొట్టుతో ఇంత పెద్ద పూలజడతో పెళ్ళిపీటల మీద చూసినప్పుడు నాకేదో అన్యాయం జరిగిందనిపించింది. అన్యాయం నాకు కాదు—ఇందిరకే. ఇందిర చక్కగా పరికిణీ, పొట్టి చేతుల చొక్కా, వాలుజడా వేసుకుతిరుగుతుంటే ఎంతో బాగుండేది. అటువంటిదానికి చీరె కట్టి ఒక ఆవిడల్లే తయారుచేశారు. ఎబ్బెబ్బే అనుకున్నాను. మా అమ్మా వాళ్లు 'చిన్నముండ ఎంత ముద్దొస్తు న్నదో!' అంటే నాకు ఆశ్చర్యమయింది. 'వీళ్లకు కళ్లు లేవా?' అనుకున్నాను.

'పెళ్ళికొడుకు అంత బాగా లేడని అందరూ గుసగుసలాడారు. నాకు మాత్రం మహా రోతగా ఉన్నాడు. వాడు ఇందిరను 'ఏయ్....

ఇదిగో !' అని పిలుస్తాడని ఊహించుకుంటే నాకు రక్తం ఉడికి పోయింది. నా కప్పటికి ఎనిమిదో ఏడు.

'పెళ్ళి అయిన కొద్ది రోజులకో, ఒకటి రెండు వారాలకో మా నాన్నకు బందరులో ఉద్యోగమయింది. స్కూలు మేస్టరు. ఇల్లు అద్దెకిచ్చి బందర్లో కాపరం పెట్టాం. అక్కడ నా కళ్లు అస్తమానమూ ఇందిరను పోలిన పిల్లకోసం వెతికేవి. ఒకత్తెకూడా కనబడేదికాదు. ఇంకో చిత్రమేమిటంటే, నేను ఇందిరను జ్ఞాపకం తెచ్చుకున్నప్పుడల్లా పెళ్లికూతురు రూపమే జ్ఞాపకం వచ్చేది. అదికూడ ఒకే ఒక స్నాప్ షాట్. ఇందిర ప్రొఫైల్. దాని మొహంమీద దీపారాధన వెలుగు లాంటి దేదోపడి, దానిముక్కూ, నున్నటి చెక్కిళ్లూ మెరుస్తున్నాయి. ఎవరో ఏదో అంటే చిరునవ్వు నవ్వే గర్వంమొహం. తళతళా మెరిసే పలువరుస, లిప్‌స్టిక్ వేసినట్టుగా పెదవులు. ఇందులో నామనసు చేసుకున్న కల్పన ఎంతో నాకు చచ్చినా తెలియదు. ఎప్పుడు ఇందిరమాట అనుకున్నా ఈ మొహమూ, ఆ మొహాన కల్యాణం బొట్టూ, పూలజడా, మధు పర్కాలూ జ్ఞాపకంవచ్చేవి. పెళ్లప్పుడు దాని ఈ అవతారంచూసి ఎందుకు అసహ్యపడ్డానో నాకు అర్థం కాలేదు, నేను చిత్రకారుణ్ణయితే నా మనసులోవున్న ఆ దృశ్యాన్ని బొమ్మవేసి గోడకు వ్రేళ్లాడగట్టి ఉందును.

'మొదటి ఏడు వేసవి సెలవులకు మాఊరు వెళ్ళాం. కాని నేను ఇందిరను చూసినట్లు జ్ఞాపకం రావటంలేదు. ఇందిరా వాళ్ళు ఏఊరైనా వెళ్ళారో లేకపోతే ఇందిరను చూసినా నాకు గుర్తులేదో ఇప్పుడు చెప్పలేను.

'ఆ మరుసటేడు మాత్రం ఇందిర పెద్ద మనిషయిందని బందరుకు వార్త అందటం నాకు బాగా గుర్తు. మానాన్న వేదాంత ధోరణిలో 'నిన్నగాక మొన్నపుట్టినట్టున్నది. అప్పుడే పెద్దమనిషయింది. రేపీపాటికి బిడ్డతల్లి కూడాఅయి కూర్చుంటుంది', అన్నాడు.

'అప్పుడే అంటారేమిటి ? దానికి పదమూడు వెళతాయో వెళ్ళాయోకూడాను!' అన్నది అమ్మ.

'ఆ యేడే ఏదో పర్వం వచ్చింది, ఇందిరా, వాళ్ళమ్మా, నాన్నా, తమ్ముడూ, సముద్రస్నానానికి బందరొచ్చి మాయింట్లో దిగారు.

అందరికీ మంచాలు లేవు. మగవాళ్ళకూ నాకూ మంచాలు వేసి మిగి లిన వాళ్ళకు అమ్మ చాపలు పరిచింది.

'ఇందిరను చూస్తే నాకు ముట్టయిన ఆడవాళ్లు జ్ఞాపకం వస్తున్నారు. పెద్దమనిషి కావటమంటే ఏమిటని అడిగితే ముట్టు కావటం లెమ్మని అమ్మ చెప్పింది. పైగా ఓణీలు వేసుకుంటూ ఆ ఇందిర పెళ్ళికూతురప్పుడంత అందంగా లేదు. అసలే నా మనస్సు గొడవగా ఉంటే, ఇందిర, 'ఇంత మంచమ్మీదా నువ్వొక్కడివే పడుకుంటావా? జరుగు!' అని గదమాయించి నన్ను పక్కకు నెట్టి మంచంమీద పడుకుంది.

నాకు ఒళ్ళంతా కంపరమెత్తింది, చెప్పొద్దూ! 'నా మంచంమీద నువ్వు పడుకోవద్దు. పో పో' అని అరిచాను. 'ఏమిట్రా ఆ అఘా యిత్యం?' అని అమ్మ నన్ను కోప్పడింది. నాకు ఏడవాలనిపించింది. ఆ రాత్రి ఎట్లా నిద్రపట్టిందో నాకే తెలీదు. ఒక రాత్రివేళ ఎవరో తన్నినట్టు మెలకువొచ్చింది. ఇందిర నన్ను చేత్తో గట్టిగా తనకేసి అదుముకుని నిద్రపోతున్నది.

'ఎంత అసహ్యం వేసిందో నువ్వూహించలేవు. ఇందిర రొమ్ము నా చేతికి మెత్తమెత్తగా నొక్కుకుని ఉన్నది. పళ్లు బిగబట్టి కసిగా ఇందిరను ఎడంగా తోసేసి, గోడకేసి తిరిగి ఇంచుమించు గోడను కరుచుకుని నిద్రపోయాను.

'తెల్లారుఝామున లేచి అందరమూ సముద్రస్నానానికి వెళ్లాం. ఆ రోజుల్లో నాకు స్త్రీ ద్వేషం చాలా ఉండేదనుకుంటాను. ఏ వయసు వాళ్ళయినా సరే, తడిబట్టలు ఒంటినంటుకుని కనిపిస్తే వాంతి అయినట్టుగా ఉండేది. నాకెంతో ఇష్టమైన ఇందిరను అట్లా చూడవలసొస్తే ఎంత బాధ కలిగిందో ఊహించుకో.

'ఆ తరవాత నేను మళ్ళీ ఇందిరను చూసింది నా పెళ్లప్పుడే. అప్పటికి ఇందిర మూడేళ్లుగా మొగుడితో కాపరం చేస్తున్నది.'

'ఈ లోపల నేను చాలా మారాను. ముఖ్యంగా కాలేజీలో అడుగుపెట్టగానే నాకు సెక్సులో కొంత ఆసక్తి కలిగింది. ఎంత మారినా ఇందిరను మాత్రం మరిచిపోలేదు. ఈసారి ఇందిర నాకు జ్ఞాపకంవస్తే నా మీద నాకే అసహ్యం వేసేది. ఆ రోజు బందరులో

నేను ఇందిరను ఎందుకు తోసేశాను? నాకేం దయ్యం పట్టింది? నాకు ఆవగింజలో అరభాగం బుద్ధిఉంటే ఇందిరను మరింత గట్టిగా అదుముకుని పడుకుని ఉండనా? అటువంటి అవకాశం మళ్ళీ ఈ జన్మలో వస్తుందా? అందులోనూ నాకెంతో ఇష్టమైన ఇందిర! నన్ను నేను ఎన్నిసార్లుతిట్టుకున్నానో, శాపనార్థాలు పెట్టుకున్నానోచెప్పలేను.

'నా పెళ్లికి ఇందిర వచ్చింది— చంటిపిల్లనెత్తుకుని. 'ఏం పెళ్లికొడకా, ఎట్లా ఉన్నావు? మా పాపాయిని చూశావా?' అంటూ నా దగ్గిర కొచ్చింది. నాకు పసిగుడ్డను చూసినా, బాలింతరాళ్ళను చూసినా వొళ్లు కంపరం ఎత్తుతుంది. పిల్లను నా చేతికివ్వబోయింది. నేను దయ్యం పట్టినట్టు 'వద్దు! వద్దు!' అంటూ వెనక్కుతగ్గాను. ఇందిర కళ్లలో నీళ్లు తిరిగినంత పని అయినట్టు నాకు అనుమానం. 'నేనంటే నీకెంత అసహ్యం!' అని చిన్నగా అని ఇందిర వెనక్కు తిరిగి వెళ్లిపోయింది.

'ఇందిర దూరంగా వెళ్ళిపోవటం నాకు ఎంతో రిలీఫయింది. కాని, ఇందిరంటే నాకు అసహ్యమన్నమాట శుద్ధ అబద్ధం. సముద్ర స్నానానికివచ్చిన ఇందిరను నేను వారానికి ఒకటి రెండుసార్లు జ్ఞాపకం చేసుకుంటూనే ఉన్నాను. కాని ఈ పచ్చి బాలింతరాలితో ఆ మాట ఎట్లా చెప్పను?

'నా పెళ్ళి ముగిసి, బంధువులంతా వెళ్ళిపొయ్యాక, అమ్మ అదీ ఇదీ మాట్లాడుతూ 'ఇందిరకూతురు కన్నీ అటువేపు పోలికలే వచ్చాయి. తల్లిపోలికొస్తే బాగుండేది. ఆడపిల్ల కూడాను.' అన్నది.

'చప్పున నా ఎదట ఇందిర అవతారం ప్రత్యక్షమయింది. బంగారు బొమ్మలాగా నాకు ఇంతదూరంలో నిలబడిన బాలింతరాలు, మిసమిసలాడే ఒళ్లు, తలంటిపోసుకున్న జుట్టు, జుట్టునుంచి సాంబ్రాణిపొగవాసనకూడా నాకిప్పుడు కొడుతున్నది. నా మనస్సులో ఉన్న ఈ దృశ్యాన్ని ఎన్నిగంటలు చూసినా నాకు తనివి తీరటంలేదు. ఎదురుగా మనిషి నిలబడి ఉన్నప్పుడు నా బుద్ధి ఏంగడ్డి తింటున్నది? ఎంత ఆలోచించినా నా ప్రవర్తన నాకు అర్థం కాలేదు.

'ఆ తరవాత రెండు మూడేళ్లపాటు నేను ఇందిరను ఆ బాలింతరూపంతో తప్ప జ్ఞాపకం చేసుకోలేకపోయాను.

'మా నాన్న బందరు ఉద్యోగం మాని మా ఊరికి తిరిగొచ్చే శాడు. కొత్తగాపెట్టిన స్కూల్లో పని దొరికింది. నేను బియ్యేతో చదువుకు స్వస్తి చెప్పి, ఏంచెయ్యాలో ఇంకా తేల్చుకోలేదు. ఆ రోజుల్లోనే నాకు టైఫాయిడ్ తగిలింది. డబుల్ సెషన్. చచ్చి బతికాను. అప్పటికింకా క్లోరొమైసిటిన్ లేదు. దాదాపు నలభై రోజులపాటు నాకు ప్రపంచంతో సంబంధం లేదు. కలలనిండా ఇందిరే. ఇందిరతో ఏదో చెప్పాలని! అదేమిటో తెలీదు! ఇందిర ఎదురుగానే ఉన్నా చెప్పవలసిందేదో చచ్చినా జ్ఞాపకం రాదు. ఆ హెల్ప్‌లెస్‌నెస్ చెప్పటానికి వీల్లేదు.

'తీరా నేను కోలుకునేసరికి ఇందిర ప్రత్యక్షం—ఏడెనిమిది నెలల కడుపుతో. ఈ సారి ఇందిర కళ్లలో నీరు స్పష్టంగానే కనబడింది నాకు. 'నిక్షేప మంటివాడివి—ఎట్లా అయిపోయావు!' అన్నది ఇందిర, కళ్లు తడుచుకుంటూ.

'ఎట్లా అయిపోయానో నాకు తెలీదు. కాని నా ఒంట్లో మాత్రం చాలా బాగున్నది. మామూలుగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు కూడా అటువంటి శరీరోల్లాసం కలగదు. పడిలేచినమీదట శరీరం అతి వేగంగా కోలుకోవటం నాకు తెలుస్తున్నది.

'కాని ఇందిర ఇంత పెద్ద కడుపుతో నన్ను పరామర్శించ రావాలా? ఆ బాలింతరాలి రూపంలోనే రాగూడదూ—ఇంకో నెలో రెండు నెల్లో ఆగి?

'ఇలా కోరటం నేను ఇందిరకు చేసిన ఆఖరు అపచారం. ఇందిర ఈసారి పురిటిమంచంలోనే పోయింది. నువు నమ్ము. నమ్మకపో—నాకీ నాటివరకూ ఇందిర ఆ కడుపుతోనూ, కన్నీళ్ల తోనూ కనబడుతుంది. అంతకు పూర్వం ఇందిర రూపం ఒక్కటీ కళ్లకు కట్టదు.'

రాజా కొంచెంసేపు తలవంచుకుని కూర్చుని చివరకు తల ఎత్తి 'దీన్ని ఏమంటావు?' అన్నాడు.

నేను మాత్రం ఏమంటాను! ప్రారబ్ధమూ, శాపమూ, కర్మా అనేవాటిలో నాకు నమ్మకంలేదు. కాని రాజా విషయంలో అందులో ఏది అనుకోమన్నా, అనుకోటానికి నేను సిద్ధమే.